# సలాం బాంబే



**దారిద్ర్యాన్ని దాచిపెట్టడం ఘోరమైతే, దాన్ని వున్న వాళ్ళ వినోద వస్తువుగా మలచడం ఘోరాల్లో ఘోరం.**

గొప్ప కళాఖండాన్ని చూశామన్న తృప్తి, ఆనందం హాలు నుంచి బయటకు వస్తున్న చాలామంది మొహాలలో వెలిగిపోతోంది. హాలు ముందు గందరగోళంగా వుంది. అడుగుతీసి అడుగువేయలేనంత రద్దీ. సిటీలోని సగం కార్లు, సగం మోటారు సైకిళ్ళు అక్కడే వున్నట్టు వాటితో నిండిపోయింది కాంపౌండ్. ఒహాటే హారన్ల రొద! అయితేనేం? అంత గొడవలోనూ సినిమా గొప్పతనం గురించి చాలామంది సీరియస్‌గా చర్చించుకుంటున్నారు. డైరెక్టర్ ప్రతిభనీ, సాంకేతిక విలువల స్థాయినీ తన్మయంగా, ముగ్ధులై కొనియాడుతున్నారు.

గేటు దగ్గర వాచ్‌మన్ ఒక్కొక్క వెహికల్‌ని జాగ్రత్తగా పంపుతున్నాడు. గేటుకు అడ్డంపడుతూ బిజీగా అడుక్కుంటున్న ముష్టి పిల్లలనీ, ముష్టి వాళ్ళనీ మధ్య మధ్యన అదిలించే బాధ్యతను కూడా నిర్వహిస్తున్నాడు.

గత మూడు రోజులుగా మా మహానగరంలో సినిమా ఉత్సవాలు జరుగుతున్నాయి. ఇవాల్టి సినిమా 'సలాం బాంబే'. తొలి రెండు రోజులు హడావిడేం లేదు. మరి ఇవాళో? సగం మంది తిరిగి వెళ్ళారు టిక్కెట్లు దొరక్క. వి.ఐ.పీ.లకు పాసులు వెళ్ళాయి. పెద్ద పెద్ద ఆఫీసర్లు, అంతకంటే పెద్ద ఇండస్ట్రియలిస్టు కళాభిమానులు ముందే టిక్కెట్లు బుక్ చేయించుకున్నార్ట.

నిజమే మరి! అది సినిమా కాదు. వాస్తవ దృశ్యం. రైల్వే ప్లాట్‌ఫారాల మీదా, పేవ్‌మెంట్ల పైనా ప్రతినిత్యం కనిపించే అనాథపిల్లలే అందులో 'హీరో'లు. చీకట్లో, వెలుతురు లాంటి చీకట్లో మురికోడుతున్న పీలికలతో సినిమా అంతటా కదలాడే ఆ నిర్భాగ్యులు నిద్రలేస్తే మన వీథిలోనూ కనిపిస్తారు. వాళ్ళ జీవితంలోని దైన్యం, మొరటుతనం, లేకితనం, బలహీనతలు, మినుకుమినుకుమంటున్న కరుణ చిత్రీకరించిన తీరు అద్భుతమే. అందుకే సినిమా ప్రదర్శించిన ప్రతి నగరంలోనూ బ్రహ్మరథం పట్టారట. వెండితెర మీద దారిద్ర్యం ఎంత హృద్యంగా వుందో చెప్పడానికి మాటలు చాలవు. దారిద్ర్యంతో బంగారం పండించారు.

పది నిమిషాల తరువాత కాంపౌండ్ నుంచి బయటపడ్డాం. నాలుగే అడుగులు వేశాం. సినిమా హాలు నుంచి మెయిన్ రోడ్డుకు వెళ్ళే సన్నటి పొడవాటి సందు నిండుగా రంగు రంగుల కార్లు మళ్ళీ ఒక్కసారిగా నిలిచిపోయాయి. హారన్ల మోత, ఇంజన్ల గొడవ, పొగ ... మధ్యలో ప్రశంసలు. పాదచారులు దాటుకు వెళ్ళడానికి సందేమైనా మిగిలి వుందేమోనని మునివేళ్ళ మీదనిలబడి చూడబోయాను. అయితే కొద్ది దూరంలోనే వున్న కార్పొరేషన్ వారి చెత్తకుండీ దగ్గర ఏదో లేచి నిలబడిన సవ్వడి. అటు చూశాను యాదృచ్ఛికంగా.

చెత్తకుండీ దగ్గర అప్పటి దాకా పాదాల మీద కూర్చుని దేనికోసమో కెలుకుతున్న ఓ కుర్రాడు ఆగిన కార్లనీ, మనుషులనీ చూసి ఆశగా లేచాడు. వాడికి పదేళ్లుంటాయి. కాని మెతుకులు చూసిన ముసలి కుక్కలా లేచాడు. చేతుల మురికిని ఒంటికి వేలాడుతున్న చొక్కా మీదకు చేర్చి, ఒక్క ఉదుటున ఆ కారు దగ్గరకు దూకాడు.

పొట్ట మీద ఎడం అరిచేత్తో ఆకలన్నట్టు కొట్టుకుంటూ, కుడి చేతిని ధర్మం చేయమన్నట్టు గాలిలో వూపుతున్నాడు. ఆ కారు డోరులోంచి భారంగా బయటకొచ్చిందో లాల్చీ చేయి. వెళ్ళమన్నట్టు గాలిలో ఆ కుర్రాడి ముఖం మీద వూగింది. వెనక డోరు దగ్గరా అంతే. వెనకాలే వున్న మరో కారు ముందు డోరు దగ్గరకు వెళ్ళి చేయి చాపాడు. వెనక డోరు దగ్గరకు జరిగి మళ్ళీ అడిగాడు. సమాధానం లేనట్టుంది. వాడి పెదవులు కదులుతుంటె, అందుకు అనుగుణంగా వాడి కళ్ళు,చేతులు దీనంగా నర్తిస్తున్నాయి. చిన్నగా కదిలింది కారు. అయినా వదలలేదు. ఆఖరికి ఒక నాణెం విసురుగా వచ్చి వాడి చేతిలోపడింది. ఇప్పుడు వినిపించింది వాడు అంటున్న మాట.

"పది పైసలమ్మా...!" సరిగ్గా మా పక్కన ఆగి వున్న కారు డోరు మీద చేయివేసి అడిగాడు వాడు.

"హేయ్! ముందా హేండ్ తియ్యి" లోపల కూర్చున్న బంగారు తీగలాంటి మహిళ బహు వయ్యారంగా చిరాకుపడింది. చీదరతో ఆమె లిప్‌స్టిక్ పెదవులు వంకర్లు పోతున్నాయి.

కానీ తీక్షణంగా చూపిందామె అపుమ. ఇందాకటి సినిమాలో కనిపించిన పిల్లాడిలాగే వున్నాడని కాబోలు. అయితే వెండి తెర మీద అంత ఆకర్షణీయంగా కనిపించిన దారిద్ర్యం, అడుగు దూరంలో వుంటే ఇంత ఘోరంగా వుంటుంది కాబోలు నన్న షాక్ ఆమె కళ్ళలో.

"పది పైసలమ్మా ...! ఒక్క పది పైసలు ..." మళ్ళీ అడిగాడు వాడు.

"గ్లాస్ వేసెయ్" పక్క సీట్లో వున్న పురుషుడు దాదాపు అరిచాడు. ఆమె గబగబా హ్యాండిల్ తిప్పుతుంటే ఇంక్ బ్లూ రంగు అద్దం డోర్‌ను కమ్మేసింది. కారు కదిలింది. కుర్రాడు అక్కడ నుంచి మరో కారు దగ్గరకు వెళుతున్నాడు. మరో కారు దగ్గరికి ... ఇంకో స్కూటరిస్టు దగ్గరికి ... తిరుగుతున్నాడు కుర్రవాడు.

— గోపరాజు నారాయణరావు